సాక్షి
పెద్దపల్లి

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

గోదావరిఖని: దివ్యాంగుల దినోత్సవాన్ని ఆర్జీ–2 ఏరియాలో గురువారం ఘనంగా నిర్వహించారు. పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, బ్రాంచ్ సెక్రటరీ జీగురు రవీందర్, ఎస్‌వోటూ జీఎం రాముడు, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, డీవైపీఎం వేణుగోపాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ పోశం పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న దివ్యాంగులతో ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, అధికారులు



శుక్రవారం ၊ 13 ၊ డిసెంబర్ ၊ 2024

న్యూస్‌రీల్

మరిన్ని నిధులు కేటాయించాలి


రైల్వే మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ వంశీకృష్ణ

రామగుండం: అమృత్‌భారత్ పథకంలో భాగంగా కొనసాగుతున్న రామగుండం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కలిసి వినతిపత్రం అందజేశారు. రామగుండంలో నవజీవన్, మిలీనియం, కర్ణాటక సంపర్క్ క్రాంతి, జైపూర్ తదితర సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని రామాలయ అభివృద్ధికి నిధులు కేటాయించి నిర్వాహణ బాధ్యతలను రైల్వేశాఖ స్వీకరించాలని కోరారు. దీనిపై కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

రక్షణ తర్వాతే ఉత్పత్తిపై దృష్టి


రక్షణ బహుమతి అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని: పూర్తిస్థాయి రక్షణ పాటించిన తర్వాతే ఉత్పత్తిపై దృష్టి సారించాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–1 జీఎం డి.లలిత్‌కుమార్, సేఫ్టీ టీమ్ కన్వీనర్ హబీబ్‌హుస్సేన్ అన్నారు. గురువారం జీడీకే–11గనిలో నిర్వహించిన రక్షణ పక్షోత్సవాల్లో మాట్లాడారు. ప్రతిఒక్కరూ రక్షణలో ముందుకు సాగుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలన్నారు. పనిలో నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని తెలిపారు. రక్షణపై అవగాహనతో పనులు చేసి సంస్థ అభివృద్ధికి పాటు పడాలన్నారు. రక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. అనంతరం గనిలోకి వెళ్లి పనిస్థలాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో అధికారులు చిలుక శ్రీనివాస్, కోలా మల్లేశ్, సభ్యులు కనకయ్య, చంద్రశేఖర్, దేశాయ్, రహమత్ అలీ, అమర్నాథ్, సత్యనారాయణ, ఆదినారాయణ, కళాధర్, చంద్రమౌళి, రవీందర్, సాయిప్రసాద్, నాయిని శంకర్ రక్షణ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

17న కలెక్టరేట్‌లో జాబ్ మేళా

జ్యోతినగర్: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని మెడ్ ప్లస్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 17న కలెక్టరేట్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ సంస్థలో ఫార్మాసిస్ట్ 20, కస్టమ్ సేల్స్ అసోసియేట్ 30, జూనియర్ అసిస్టెంట్ 50, ఆడిట్ అసిస్టెంట్ 15 పోస్టులు ఖాళీ ఉన్నాయని అన్నారు. సేల్స్ ఫార్మాసిస్ట్ పోస్టులకు డిప్లొమా/డిగ్రీ ఇన్ ఫార్మసీ, జూనియర్ అసిస్టెంట్, కస్టమర్ సేల్స్ అసోసియేట్, ఆడిట్ అసిస్టెంట్లకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు 17న కలెక్టరేట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

నారుమడుల పరిశీలన


నారు మడులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

పెద్దపల్లి రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో రైతులు సాగు చేస్తున్న వరి నారుమడులను గురువారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. డాక్టర్ వెంకన్న, సస్యరక్షణ శాస్త్రవేత్త కిరణ్ పిల్లి, మృత్తిక శాస్త్రవేత్త వినోద్‌కుమార్‌లు వరి నాడుమడుల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. చలితీవ్రతతో పాటు వివిధ పోషక లోపాలు ఉన్నట్లు గుర్తించామని, లోపాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందాన్ని సంప్రదించాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఉన్న శ్రీరామాలయం విషయమై ఈనెల 10న అభివృద్ధికి నోచుకోని ఆలయం పేరుతో ప్రచురితమైన కథనంపై సామాజిక కార్యకర్త మద్దెల దినేశ్ స్పందించారు. సాక్షి కథనం క్లిప్పింగ్ జోడిస్తూ కేంద్ర రైల్వేశాఖ మంత్రితో పాటు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్‌కు ఎక్స్ ద్వారా ఫిర్యాదు చేశారు.

ముంపు భయం తొలగేనా..?

- గతంలో కురిసిన భారీవర్షాలకు గోదావరిఖని ప్రాంతంలోని మల్కాపూర్, సప్తగిరికాలనీ, ప్రశాంత్‌నగర్, రెడ్డికాలనీ, గంగానగర్, రఘుపతిరావునగర్, ఎన్టీపీసీ మేడిపల్లి, మల్కాపూర్‌లోని సుమారు 10వేల కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. ఇళ్లలోకి నీళ్లు వచ్చి వందలా మంది నిరాశ్రయులయ్యారు. లోతట్టు ప్రాంతాల నుంచి బోట్ల ద్వారా ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నదికి ఇరువైపులా కరకట్ట నిర్మాణం చేపట్టితే వరద ముంపు నుంచి కాపాడే అవకాశం ఉంది. రూ.200 కోట్ల అంచనాలతో కరకట్ట నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు పంపినప్పటికీ ఆమోదానికి నోచుకోలేదు. గోదావరి నదికి అవతలి పక్కన ఉన్న మంచిర్యాల జిల్లా కేంద్రానికి కరకట్ట నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో రామగుండం నియోజకవర్గ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కూడా ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఈ ప్రాంతానికి కరకట్ట నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నారు.

- గోదావరి బ్యాక్‌వాటర్‌తో పలు కాలనీలకు వరద ముప్పు
- కరకట్ట నిర్మాణంపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ప్రజల విజ్ఞప్తి


నీట మునిగిన సప్తగిరికాలనీ (ఫైల్)

గోదావరిఖని: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి వరద ముప్పు మొదలైంది. భారీ వర్షాలు వస్తే సుందిళ్ల పార్వతి బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో గోదావరినదిలో నీటి మట్టం పెరిగి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంటపొలాలు, ఇళ్లు నీటమునిగి భారీగా నష్టం జరుగుతోంది. 30ఏళ్ల క్రితం వరదలు వచ్చి గోదావరినది ఉప్పొంగినా పవర్‌హౌజ్‌కాలనీ, గంగానగర్ వరకు వచ్చాయి. ప్రస్తుతం సుందిళ్ల పార్వతి బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో గోదావరిఖనిలోని ప్రశాంత్‌నగర్, సప్తగిరికాలనీ, రెడ్డికాలనీ, మల్కాపూర్, రఘుపతిరావునగర్, మేడిపల్లి ప్రాంతాలు ముంపునకు గురతున్నాయి. గోదావరినదికి ఇరువైపు కరకట్ట నిర్మాణం చేపడితే వరద ముంపు నుంచి బయటపడే అవకాశాలు ఉన్నాయి.

రూ.200కోట్లతో అంచనాలు సిద్ధం

గోదావరినది ఒడ్డున కరకట్ట నిర్మాణానికి గతంలో అధికారులు రూ.200కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనివల్ల కరకట్ట నిర్మాణంతో పాటు వరద నీరు, వ్యర్థాలు నేరుగా నదిలో కలవకుండా వరద కాలువ డైవర్షన్ చేయవచ్చు. ప్రస్తుతం ఈ అంచనా వ్యయం రెట్టింపు కావచ్చని అంటున్నారు. ఈ విషయంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ప్రభుత్వంతో ఇప్పటికే మాట్లాడారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో అనుమతులు వస్తేనే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని భావిస్తున్నారు.

ముప్పు ఉందని ముందే గుర్తించినా..

కాళేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటుతో లోతట్టు ప్రాంతాలకు ముంపు ఉంటుందని ముందే భావించారు. ముంపు గ్రామాలను గుర్తించాల్సిన అధికారులు పట్టించుకోలేదు. ముందుగా అనుకున్న ప్రణాళిక ప్రకారం సముద్రమట్టానికి 132మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించాలని డిజైన్ చేశారు. దానిని మార్పు చేసి 138మీటర్ల ఎత్తుకు పెంచారు. దిగువ ప్రాంతానికి 8లక్షల క్యూసెక్కుల నీటిని వదలాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. భారీ వర్షాలకు 15నుండి 20లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి వచ్చింది. అంత కెపాసిటీ లేకపోవడంతో గోదావరి నదికి ఇరువైపులా పెద్దమొత్తంలో నీరు నిలిచి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. గోదావరిఖని గంగానగర్ సమీపంలో రాజీవ్‌రహదారిపై నుంచి వరదనీరు ప్రవహించింది.

మంచిర్యాల వైపు ప్రతిపాదనలతో ఆందోళన

మంచిర్యాల జిల్లాకు వరద ముప్పు లేకుండా కరకట్ట నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈక్రమంలో రామగుండం నియోజకవర్గ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాలవైపు కరకట్ట నిర్మాణం పూర్తయి పార్వతి బ్యారేజీలో నీరు నిల్వ ఉంటే నియోజకవర్గంలో గోదావరిఖనితో పలు ప్రాంతాలు ముంపు బారిన పడే ప్రమాదముంది. ప్రస్తుత ఎమ్మెల్యే ఈవిషయంలో చొరవ తీసుకుని అసెంబ్లీలో ఈ సమస్యను లేవనెత్తాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నిధుల కేటాయింపు కోసం కృషి



ఇప్పట్లో పార్వతీ బ్యారేజీలో నీరు నిలిపే అవకాశాలు లేవు. భవిష్యత్‌లో వరద ముప్పు లేకుండా గోదావరినదిపై కరకట్ట నిర్మాణానికి అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా. మంచిర్యాలకు నిధులు మంజూరైతే మన ప్రాంతానికి కూడా నిధులు తప్పనిసరిగా వచ్చేలా చూస్తా. వాస్తవ పరిస్థితులు ముఖ్యమంత్రికి వివరించి నిధుల కేటాయింపునకు కృషి చేస్తా. ప్రజల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- కామన్ డైట్ మోనూ అమలుపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం ఆహారం అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ అమలుపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 14న ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ మెనూ కార్యక్రమం, లంచ్ ఉంటుందని, కామన్ డైట్ ప్లాన్ అమలులోకి వస్తుందని అన్నారు. దీనిపై విస్తృతం ప్రచారం చేసి పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని తెలిపారు. ఉదయం 11గంటలకు రెసిడెన్షియల్ పాఠశాలలకు ముఖ్య అతిథులు చేరుకొని 11–12గంటల వరకు క్షుణ్ణంగా పరిశీలన, 12–12.30 వరకు పిల్లలతో ఇంటరాక్షన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం కామన్ డైట్ ప్లాన్ బ్యానర్‌ను ఆవిష్కరించి ప్రసంగిస్తారని తెలిపారు. ఒంటి గంటకు పిల్లలు, తల్లిదండ్రులతో భోజనం చేస్తారని అన్నారు. హాస్టళ్లలో కామన్‌డైట్ వివరాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని వివరించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని అన్నారు. కిచెన్, డైనింగ్ ఏరియాలను శుభ్రంగా ఉంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వజ్రాయుధంగా వజ్రవాహనం

- రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్


వజ్రవాహనాన్ని పరిశీలిస్తున్న సీపీ ఎం.శ్రీనివాస్

గోదావరిఖని: పోలీసులకు వజ్రాయుధంగా వజ్రవాహనం ఉపయోగపడుతుందని రామగుండం పోలీస్‌కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ హెడ్ క్వార్టర్‌లో గురువారం ఏఆర్ కానిస్టేబుళ్లకు అల్లర్ల సమయంలో ఉపయోగించే పోలీసు వజ్రవాహనంపై అవగాహన కల్పించారు. అల్లర్ల సమయంలో స్మోక్, భారీ శబ్దంతో కూడిన స్టన్ గ్రైనేడ్ సెల్స్ ఏవిధంగా ఫైర్ చేయాలనే విషయాలను వివరించారు. స్వయంగా ఫైర్ చేసి చూపించారు. శాంతి భద్రతల విధుల్లో ఉన్న పోలీసుల భద్రత దృష్ట్యా ఈ వాహనానికి చుట్టూ ఇనుప జల్లెడ ఉంటుందని, ఎక్కువగా ఘర్షణలు చోటుచేసుకుంటున్న సమయంలో పోలీసులు అల్లర్లను కట్టడి చేసేందుకు ఈ వాహనంలో 12 మంది సిబ్బంది సైతం ప్రయాణించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్‌ఐలు దామోదర్, వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్‌లు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

జూలపల్లి: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను విస్తృతపర్చనున్నట్లు రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. గురువారం జూలపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. కంప్యూటర్ల పనితీరు, రికార్డులను పరిశీలించారు. నేరాల ఫిర్యాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఎలిగేడు మండల కేంద్రంలో త్వరలో పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలతో మరింత మమేకమయ్యేందుకు గ్రామాల్లో పల్లె నిద్ర చేపట్టనున్నామని అన్నారు. సీపీ వెంట పెద్దపల్లి డీసీపీ చైతన్య, ఏసీపీ జి.కృష్ణ, సూల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి ఉన్నారు.

జాతీయ పురస్కారం గర్వకారణం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


అయ్యప్ప మహా పడిపూజలో మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: మంథని మండలం చిల్లపల్లి గ్రామపంచాయతీ మహిళా సంఘ సభ్యుల పనితీరుకు జాతీయస్థాయి పురస్కారం లభించడం అభినందనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం మంథనిలోని అయ్యప్ప, దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కాంక్షించారు. మహిళలు చేస్తున్న ప్రగతి శీల కార్యక్రమాలకు దేశ స్థాయిలో అవార్డు లభించడం గర్వకారణమన్నారు. ఆర్థిక క్రమ శిక్షణతో మహిళలు వ్యాపారం, వాణిజ్యం చేస్తూ ఉపాధి పొందడం అభినందనీయమన్నారు. చిల్లపల్లి గ్రామ మహిళలు ఉదాహరణగా నిలిచారన్నారు. ఇక్కడి ప్రజలు..ప్రజాప్రతినిధుల ప్రత్యేక చొరవతో దేశ స్థాయిలో గుర్తింపు వచ్చిందని తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో మంథని మండలం సూరయ్యపల్లిలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిపూజలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు.

'ఎంతమంది అడ్డుపడ్డా వర్గీకరణ ఆగదు'


మాట్లాడుతున్న థామస్

సుల్తానాబాద్: ఎస్సీ వర్గీకరణకు ఎంతమంది అడ్డుపడ్డా ఆగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ థామస్ అన్నారు. గురువారం సుల్తానాబాద్‌లోని రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంత్రి పదవి కోసమే హైదరాబాద్‌లో మాలమహానాడు బహిరంగ సభ ఏర్పాటు చేశారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఏబీసీడీ వర్గీకరణ చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఒకే కుటుంబానికి మూడు టికెట్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. డబ్బుతో రాజకీయాలను ముడిపెడుతూ మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేసి సుల్తానాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. సభకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని అన్నారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మంథని చందు, నాయకులు చంద్రమౌళి, రాజేశం, శంకర్, గంగారం, రాజేశం, కృష్ణయ్య, గట్టయ్య, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

అదానీ వ్యవహారంపై సమాధానం చెప్పాలి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

పెద్దపల్లి రూరల్: అదానీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పెద్దపల్లిలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సీపీఐ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని అన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారని, ఇల్లు లేని నిరుపేదలకు వచ్చేలా కార్యాచరణ రూపొందించి ఆదుకోవాలని అన్నారు. ఈనెల 26 నుంచి జరిగే వందేళ్ల సీపీఐ ఉత్సవాలను జిల్లా కేంద్రంతో పాటు ప్రతీ మండల, గ్రామంలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, జిల్లా సహాయ కార్యదర్శి గోశిక మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గౌతమ్ గోవర్ధన్, రామగుండం నగర కార్యదర్శి కే కనకరాజ్, కౌన్సిల్ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాల సంఖ్య తగ్గించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అన్నప్రసన్న కుమారి


మాట్లాడుతున్న డాక్టర్ అన్నప్రసన్న కుమారి

పెద్దపల్లి రూరల్: జిల్లాలో శిశు మరణాల సంఖ్య తగ్గించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్నప్రసన్న కుమారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన శిశు మరణాల సమీక్ష కమిటీ సమావేశంలో మాట్లాడారు. మనదేశంలో 1,000 సజీవ జననాలకు 25, తెలంగాణలో 23 కాగా, మన జిల్లాలో 7మంది శిశు మరణాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో ఏప్రిల్ 2024 నుంచి నవంబర్ 2024 వరకు జరిగిన శిశు మరణాలు 35 నమోదు కాగా వాటిలో 6 శిశు మరణాల కేసులను ఎంపిక చేసి వాటిపై సమీక్ష నిర్వహించడం జరిగిందని అన్నారు. నెలలు నిండకుండా, బరువు తక్కువగా పుట్టిన పిల్లలు, జ్వరం వచ్చి ఫిట్స్‌తో చనిపోయిన పిల్లలు, ఉమ్మ నీరు మింగడం వల్ల చనిపోయిన పిల్లలు, కొందరు పాలు పట్టిన తర్వాత తల్లి సరిగా భుజం పైన వేసుకొని శిశువును చేతితో తట్టకపోవడం వల్ల చనిపోయారని స్పష్టం చేశారు. గర్భిణులకు సరైన పోషణ అందిస్తూ, మానసికంగా ఆనందంగా ఉంచి బీపీ పెరగకుండా చూసుకోవాలని అన్నారు. శిశువులలో ప్రమాద చిహ్నాలను గుర్తించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లేలా తల్లిదండ్రులను ప్రోత్సాహించాలని తెలిపారు. సమావేశంలో డాక్టర్లు కిరణ్ కుమార్, శ్రీధర్, రవీందర్, స్రవంతి, పద్మతో పాటు పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైవ్‌స్టార్ రేటింగ్‌తో అగ్రగామిగా ఓసీపీ–1


మాట్లాడుతున్న భైద్యా

గోదావరిఖని: ఫైవ్‌స్టార్ రేటింగ్‌తో ఓసీపీ–1 పాజెక్టు అగ్రగామిగా నిలుస్తోందని, ఇదే స్ఫూర్తితో ముందు సాగాలని సేఫ్టీ కమిటీ కన్వీనర్ భైద్యా, ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. రక్షణ వారోత్సవాల సందర్భంగా గురువారం ఓసీపీ–1 సైటాఫీస్ వద్ద కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉత్తమ రక్షణ చర్యలు, పాటించిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. రక్షణ చర్యలు పటిష్టంగా నిర్వహించిన తర్వాతే భారీ యంత్రాలు నడిపించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ జింగిటి రాజశేఖర్, యూనియన్ నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గుంజపడుగు గ్రామ శివారులో కిక్కిరిసిన ధాన్యం


చిల్లపల్లి గ్రామ ఐకేపీ సెంటర్‌లో..

తేమరాదు ధాన్యం పోదు

ఈ చలికి తేమ శాతం వచ్చే వరకు ఆరబోసుదూ.. కుప్ప చేసుదూ ఇదే పనైతంది అంటూ రైతులు అరగోస పడుతున్నారు. వర్షం పడితే తమ శ్రమంతా నీటి పాలవుతుందంటూ ఆవేదన చెందుతున్నారు. ఐకేపీ కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండల కేంద్రంతో పాటు, గుంజపడుగు, సుందిళ్ల, చిల్లపల్లి, నాగారం పలు గ్రామాల్లోని ఐకేపీ సెంటర్లలో గురువారం పెద్ద మొత్తంలో ధాన్యం ఆరబోసిన దృశ్యాలు 'సాక్షి' కెమెరాకు కనిపించాయి.– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు

మంథని: మంథని మున్సిపల్ పరిధిలోని లైన్‌గడ్డలో గురువారం జాతీయ విపత్తులపై నేషనల్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వరదలు, భూకంపాలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ, కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, రవి, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో రైతు మృతి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట కు చెందిన కరిపెల్లి అంజయ్య (54) గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అంజయ్య బుధవారం వ్యవసాయ పనులకు వెళ్లి రాత్రి ఇంట్లో నిద్రించాడు. గురువారం వేకువజామున ఛాతీలో నొప్పిగా ఉందని కుటుంబసభ్యులకు తెలపగా.. చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుడు..


నగేశ్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు చేని నగేశ్ (61) గురువారం మృతిచెందారు. మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో జేఏసీలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆయన పూసల సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

కారు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..


యశ్వంత్ (ఫైల్)

జగిత్యాలక్రైం: మిత్రుడి వివాహానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా కారు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని టీట్‌బజార్‌లో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. టీట్‌బజార్ ప్రాంతానికి చెందిన పల్లె లక్ష్మీనారాయణ కుమారుడు పల్లె యశ్వంత్‌కుమార్ (30) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తన మిత్రుడి వివాహానికి వెళ్తున్నానని ఇంటినుంచి వెళ్లాడు. స్కూటీపై ఇంటికి వస్తుండగా టీట్ బజార్‌లో జగిత్యాల-కోరుట్ల ప్రధాన రహదారిపై కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణ ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీసీ కెమెరా ఆధారంగా ప్రమాదానికి కారణమైన కారును కోరుట్లలో గుర్తించారు. మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మన్మథరావు తెలిపారు.

వేధింపులు తట్టుకోలేక యువతి ఆత్మహత్యాయత్నం

- యువతి వాంగ్మూలం రికార్డ్ చేసిన జడ్జి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతి అదే గ్రామానికి చెందిన యువకుడి వేధింపులు తట్టుకోలేక గురువారం గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న యువతి వద్దకు న్యాయమూర్తి ప్రవీణ్ వచ్చి వాంగ్మూలం తీసుకున్నారు. ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వేధింపులకు పాల్పడ్డ యువకుడు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

రైల్వే సిబ్బంది హై అలర్ట్

ఓదెల: చలి తీవ్రత పెరిగిన దృష్ట్యా కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో రైళ్ల రాకపోకలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రైల్వే శాఖ సిబ్బందిని హైఅలర్ట్ చేసింది. ఉప్పల్, జమ్మికుంట, పొత్కపల్లి, ఓదెల, కొలనూర్, పెద్దపల్లి, రాంగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి స్టేషన్ల మధ్యలో రైలుపట్టాల పరిశీలన కోసం ట్రాక్‌మెన్‌లను అప్రమత్తం చేసినట్లు తెలిసింది. రెండురోజులుగా చలితీవ్రత పెరగటంతో రైలుపట్టాలు సంకోచ వ్యాకోచం చెంది విరిగి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం.

రేషన్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్: పెద్దపల్లి పట్టణం రంగంపల్లి శివారులో గురువారం డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న 42 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బియ్యంతో పాటు డీసీఎం వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

పల్లెకు 'పసుపు' తోరణాలు

- జిల్లాలో 34వేల ఎకరాల్లో పసుపు సాగు
- గతేడాది ధర పెరగడంతో రైతుల మొగ్గు


మేడిపల్లిలో కళకళలాడుతున్న పసుపు తోట

జగిత్యాలఅగ్రికల్చర్: ఉద్యాన పంట అయిన పసుపును జిల్లాలో ప్రధానంగా సాగు చేస్తుంటారు. పంటకాలం దాదాపు తొమ్మిది నెలలు ఉంటుంది. దీంతో జిల్లాలోని ఏ గ్రామంలో చూసినా రోడ్లవెంట పసుపు తోటలే స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా పసుపు తవ్వడం నుంచి ఉడికించడం, మార్కెట్‌కు తరలించే సమయంలో గ్రామాల్లో సందడి, పండుగ వాతావరణం కనిపిస్తుంది.

జిల్లాలో 34,110 ఎకరాల్లో..

ఉద్యానశాఖ అంచనా ప్రకారం జిల్లాలో 34,110 ఎకరాల్లో పసుపు సాగైంది. గతేడాది పసుపు ధర క్వింటాల్‌కు రూ.15 వేలు పలికింది. దీంతో సాగు విస్తీర్ణం పెరిగింది. మెట్‌పల్లిలో 6,196, మల్లాపూర్‌లో 5,123, ఇబ్రహీంపట్నంలో 5,121, జగిత్యాల రూరల్‌లో 3,202, కోరుట్లలో 2,684, రాయికల్‌లో 2,380, కథలాపూర్‌లో 2,354, మేడిపల్లిలో 1,557 ఎకరాల్లో పంట వేశారు. మల్యాలలో 919, గొల్లపల్లిలో 753, ధర్మపురిలో 749, వెల్గటూర్‌లో 722, బుగ్గారంలో 687, జగిత్యాల అర్బన్‌లో 643, సారంగాపూర్‌లో 523, బీర్‌పూర్‌లో 187, కొడిమ్యాలలో 169, పెగడపల్లిలో 141 ఎకరాల్లో పసుపు పండిస్తున్నారు.

ధర ఉన్నా.. లేకున్నా

జిల్లాలోని ఒక్కటి రెండు గ్రామాలను మినహాయిస్తే మెజార్టీ గ్రామాల్లో పసుపు సాగు చేస్తుంటారు. పసుపు పంటకు ధర ఉన్నా.. లేకున్నా ప్రతీగ్రామంలో పసుపు సాగుచేయడం అనవాయితీగా వస్తోంది. పంట విత్తనాన్ని కొనుగోలు చేయకుండా, గతేడాది పంట నుంచి సేకరిస్తారు. పంటకు రసాయన ఎరువులు వాడకుండా, సేంద్రియ కోళ్ల ఎరువు, పేడతో పాటు చెరువు మట్టిని వాడుతుంటారు. సాధారణ రైతులు కనీసం అర ఎకరం వరకు సాగు చేస్తే, మధ్యతరగతి, పెద్ద రైతులు 3-4 ఎకరాల్లో పంట వేస్తున్నారు. ఎకరాకు 25- 30క్వింటాళ్ల దిగుబడిని తీస్తున్నారు. ఒక్కోరైతు 25 నుంచి 200 క్వింటాళ్ల పసుపును పండిస్తారు.

పంట చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి

జిల్లా రైతులు సాగు చేసిన పసుపు తోటలు చూసేందుకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర రైతులు వస్తుంటారు. జాతీయ ఉద్యాన పంటల నిపుణులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తోటలను సందర్శిస్తుంటారు. జిల్లా రైతులు పండించిన పసుపును జగిత్యాల, మెట్‌పల్లి మార్కెట్లతో పాటు నిజామాబాద్, మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్లకు తీసుకెళ్తున్నారు. జిల్లాలో ఎర్ర నేలలు పసుపుకు అనుకూలంగా ఉండటం, నాణ్యతో కూడిన దిగుబడులు రావడంతో, ఇక్కడి రైతులు తీసుకెళ్లిన పంటకు మార్కెట్లో మంచి ధర పలుకుతోంది.

ఏటా పంట వేస్తా



పసుపుకు ధర ఉన్నా, లేకున్నా పంట సాగు చేస్తుంటాను. మా మండలంలోని దాదాపు ప్రతీ గ్రామంలో ప్రతీరైతు పసుపు సాగు చేస్తుంటారు. మిగతా పంటల ద్వారా వచ్చే ఆదాయం ఖర్చులకు పోతుంటే, పసుపు పంట ద్వారా వచ్చే ఆదాయం మిగులుబాటుగా ఉంటుంది.

– మారు మురళీధర్ రెడ్డి, వెల్లుల్ల, మెట్‌పల్లి

సాగు పెరుగుతోంది



జిల్లాలో వరి, మొక్కజొన్న తర్వాత పసుపు ప్రధాన పంట. గతేడాది ధర పెరగడంతో పసుపుసాగు విస్తీర్ణం పెరిగింది. పంటకు సేంద్రియ ఎరువులతో పాటు చెరువు మట్టిని బాగా వాడి, మంచి దిగుబడులు సాధిస్తున్నారు. పసుపుసాగుపై రైతులకు మంచి అవగాహన ఉంది.

– దేవప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

జిల్లాలో 'ఖాకీ' కిడ్స్

- తప్పు చేస్తే శిక్ష తప్పదు
- వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదులు
- పోక్సో గళం విప్పిన తీరు
- గంజాయి, డ్రగ్స్ నివారణకు చర్యలు
- రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్


అఖిల్ మహాజన్, ఎస్పీ

సిరిసిల్లక్రైం: ఇన్నాళ్లు పెద్దలను సరిచేయడానికి చట్టాలను వాడిన పోలీసులు ఇప్పుడు వారి పిల్లలనే ఇంటిలో పోలీసులుగా మార్చేందుకు నూతన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. దీనిని త్వరలోనే ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సన్నద్ధమవుతున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ వెల్లడించారు. విధుల్లో చేరి దాదాపు రెండేళ్లు కావస్తున్నా వేళ జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల్లో వాటిలో సాధించిన ఫలితాలు, నూతన జిల్లా పోలీస్ కార్యాలయం వేదికగా నిలువనుంది. సరికొత్త ఆలోచన విధానాలను ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం 'సాక్షి'తో పంచుకున్నారు.

మార్పు వచ్చేలా..

నేరం చేస్తే కేసు నమోదు.. దర్యాప్తులో నిజానిజాలు తెలిసేనాటికి చూద్దాంలే అంటూ తప్పు మీద తప్పు చేసే విధానాలకు చెక్‌పడేలా రోజువారీగా జిల్లాలోని వివిధ స్టేషన్లలో నమోదైన కేసులలో నేరస్తులకు శిక్షపడేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఒకే రోజు ఐదు కేసుల్లో జైలుశిక్ష పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 74 కేసుల్లో జైలుశిక్షలు పడ్డాయి. ఇందులో జీవితఖైదీ 3, పదేళ్ల జైలు ఒకరికి, ఏడాది జైలు 32 మందికి పడ్డాయి.

పిల్లల నుంచి ప్రారంభించాలని..

చిన్న తప్పిదాలు ఇంటి పెద్దలను కోల్పోయేలా చేస్తున్న సందర్భాలు అనేకం చూస్తున్నాం. అందులో ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్‌స్పీడ్, గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలుగా మారడం వంటి వాటితో ప్రాణనష్టం జరుగుతుంది. వీటిని నివారించడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ఇక నుంచి పిల్లలు ప్రేమగా వారి పెద్దలకు ట్రాఫిక్‌రూల్స్పై అవగాహన కల్పించేలా 'ఖాకీ' కిడ్స్ కార్యక్రమాన్ని రూపొందించాం. జిల్లాలోని పాఠశాలల్లోని పిల్లలకు చట్టాలు, ప్రమాదాల నివారణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించి వాటిని వారి కుటుంబ సభ్యులతో పాటించేలా చేయడమే 'ఖాకీ' కిడ్స్ ప్రధాన ఉద్దేశం. అధికారులు చెప్పిన వినని పెద్దలు పిల్లలు ప్రేమగా చెబితే వింటారనే విధానాన్ని అమలు చేయాలని ఆలోచించాం.

నిర్భయంగా వెల్లడించేందుకు వీలు..

జిల్లాలో షీటీం, మెసేజ్ యువర్ ఎస్పీ వంటి కార్యక్రమాలతో వేధింపుల విషయాన్ని మహిళలు నిర్భయంగా చెబుతున్నారు. సాధారణంగా వచ్చిన ఫిర్యాదులతోపాటు విశ్వసనీయంగా వచ్చిన ఫోన్ సమాచారంతో జిల్లాలో ఇప్పటికి 47 కేసులు నమోదయ్యాయి. ఇందులో 4 కేసుల్లో జైలుశిక్ష పడింది. గంజాయి నియంత్రించే విషయంలో అనేక మంది సమాచారం అందిస్తున్నారు. అలా వచ్చిన సమాచారంతో ఇప్పటికీ 93 కేసులు నమోదుకాగా 211 మందిని రిమాండ్ చేశాం. వీరి నుంచి దాదాపు 50 కిలోల గంజాయిని సీజ్ చేశాం.

ప్రజలతో మమేకమవుతూ..

జిల్లాలో శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసులు మాత్రమే పనిచేస్తే సరిపోదని, ఇది ప్రజలందరి భాగస్వామ్యమని అవగాహన కల్పిస్తున్నాం. దీనిలో భాగంగా నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టాం. ఈ కార్యక్రమంతో ఇప్పటికే 1,100 మంది వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రజల సహకారంతో ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీలు, విద్యార్థినుల రక్షణకు ఆపరేషన్ జ్వాలాలో సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ, యాంటీ డ్రగ్ క్లబ్స్, బస్ భరోసా, సేఫ్ ఆటో వంటి అనేక కార్యాక్రమాలను అమలు చేస్తున్నాం.

గల్ఫ్ మోసాలపై..

జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు కార్మికులను పంపడానికి ఐదు మ్యాన్‌పవర్ కంపెనీలకు అనుమతి ఉంది. నకిలీ గల్ఫ్ ఏజెంట్ల మోసాలపై ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేయడంతోపాటు వారిని రిమాండ్ చేస్తున్నాం. వీసా తీసుకునే ముందు జిల్లాలోని ఎస్పీ విభాగంలో సీఐ స్థాయి అధికారితో వీసా విషయాలతో కంపెనీపై సమాచారం తెలుసుకుంటే మోసాన్ని మొదట్లోనే అరికట్టే అవకాశం ఉంటుంది. ఇప్పటికీ 50 మందికి పైగా నకిలీ గల్ఫ్ ఏజెంట్లను రిమాండ్ చేశాం.

ఇంకా చేయాల్సినవి ఉన్నాయి

జిల్లాలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్స్ కావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తోపాటు మంత్రులకు నివేదికలు పంపించాం. సిరిసిల్ల, వేములవాడలో ట్రాఫిక్ నియంత్రణకు ఆర్ఎస్ఐ స్థాయి అధికారి పనిచేస్తారు. కొత్తగా ఏర్పడిన రుద్రంగి, వీర్నపల్లి, తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్స్‌తోపాటు మహిళా పోలీసు స్టేషన్ల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు విన్నవించాం.

ఖాతాదారుడికి తెలియకుండానే డబ్బులు ఖాళీ

- రూ.34,500 మోసపోయిన కథలాపూర్ వ్యక్తి

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన కల్లెడ ప్రసాద్‌కు చెందిన డబ్బులు అతనికి తెలియకుండానే బ్యాంక్ ఖాతాలో నుంచి ఖాళీ అయిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు, గ్రామస్తుల కథనం ప్రకారం.. కల్లెడ ప్రసాద్‌కు కథలాపూర్‌లోని యూనియన్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. అతని కుమారుడు దుబాయి నుంచి రూ.30వేలు ప్రసాద్ ఖాతాలో జమ చేశాడు. ఆ ఖాతాలో అప్పటికే రూ.4,500 ఉన్నట్లు బాధితుడు తెలిపారు. అయితే ప్రసాద్‌కు తెలియకుండానే మూడు రోజుల క్రితం ఖాతాలోని డబ్బులు ఖాళీ అయ్యాయి. విషయాన్ని ప్రసాద్ గురువారం గుర్తించి సైబర్ క్రైం టోల్ ఫ్రీనంబర్ 1930కు ఫిర్యాదు చేశారు. ఆ డబ్బులు బెంగళూర్‌లోని వ్యక్తి ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ అయినట్లు సైబర్ క్రైం పోలీసులు గుర్తించినట్లు ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బాధితుడు కథలాపూర్ పోలీసులను ఆశ్రయించారు.

కేజీబీవీలో ఇంటెలిజెన్స్ అధికారుల విచారణ


ఉపాధ్యాయులను విచారిస్తున్న అధికారులు

సారంగాపూర్: సారంగాపూర్ కస్తూరిబా బాలికల విద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయంపై గురువారం ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. సీఐ రాజేందర్, నియోజకవర్గ ఇన్‌చార్జీ గంగాధర్ విద్యాలయానికి చేరుకుని అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందుతోందా అని అడిగి తెలుసుకున్నారు. వేడినీరు అందరికి అందడం లేదని విద్యార్థులు పేర్కొన్నట్లు సమాచారం. విద్యాలయంలో పరిమితికి మించి విద్యార్థులు ఉన్నారని అధికారులు గుర్తించారు. తాజా కూరగాయలు, పళ్లు, ఇతర పప్పులు, ఇతర వస్తువులు నాణ్యమైనవి వాడుతున్నారనా అని ప్రశ్నించారు. కోతుల బెడద తీవ్రంగా ఉందని, పలువురు విద్యార్థులను గాయపరిచాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని అధికారులు తెలిపారు. వారి వెంట ఎంఈవో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువతి మృతి


పూజిత (ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం పొత్తూరులో రోడ్డుపై బుధవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ యువతి గురువారం తెల్లవారుజామున మరణించింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లంతకుంట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన ఆకారం పూజిత (24)కు రెండేళ్ల క్రితం సిద్దిపేట జిల్లా లింగారెడ్డిపల్లెకు చెందిన ఆకారం అజయ్‌తో వివాహమైంది. వీరికి ఒక పాప. పూజిత డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు హాల్‌టికెట్ కోసం తన భర్త అజయ్‌తో కలిసి బైక్‌పై బుధవారం కరీంనగర్‌కు వెళ్లి తిరిగి వస్తుంది. ఈక్రమంలో పొత్తూరు పెట్రోల్‌బంక్ వద్ద రోడ్డుపై ఎదురుగా బైక్ నడుపుతూ వస్తున్న యువకుడు ఢీకొట్టడంతో పూజిత దంపతులు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా పూజిత గురువారం తెల్లవారుజామున మరణించిందని తెలిపారు. అజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

జాతీయ చెస్ పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థికి రజతం


సుప్రీత్‌ను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నర్మదాపురంలో ఇటీవల జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పాఠశాలల అండర్-17 చదరంగ పోటీల్లో కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి సుప్రీత్ రజత పతకం సాధించినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. విద్యార్థిని గురువారం అభినందించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై అవగాహన కల్పించడమే కాకుండా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

బోటు నిర్వహణకు అనుమతులు

- సేఫ్టీ చర్యలు సూచించిన పర్యాటక శాఖ


బోటు సేఫ్టీ చర్యలపై డెమో ఇస్తున్న టూరిజం శాఖ ఉద్యోగి

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో వరదవెల్లి గుట్టపై స్వయంభూగా వెలసిన దత్తాత్రేయస్వామి దర్శనానికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ బోటు సమకూర్చిన విషయం తెలిసిందే. కాగా మానేరు నీటిలో బోటు నిర్వహణ అనుమతుల కోసం పర్యాటకశాఖ అధికారులకు స్థానిక ఆలయ కమిటీ విన్నవించింది. ఈమేరకు టూరిజం శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతో బోట్ సేఫ్టీ అథారిటీ సభ్యుడు కిరణ్‌కుమార్ గురువారం ప్రాజెక్టు పరిసరాల్లో బోటు ఫిట్‌నెస్‌ను పరిశీలించారు. బోటులో ఎంతమందిని తరలిస్తే ప్రమాదాలకు గురికాకుండా ఉంటారు అనే విషయాలు పరిశీలించారు. లైఫ్ జాకెట్ వేసుకుని బోటులో ప్రయాణించాలని భక్తులకు సూచించారు. పలు సేఫ్టీ చర్యలపై డెమో ద్వారా భక్తులకు అవగాహన కల్పించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, ఆడెపు రాజు, నాగుల వంశీ, పీచర మాధవరావు, సంతోష్‌రావు తదితరులు ఉన్నారు.

లక్షలు వెచ్చించినా దక్కని ప్రాణం

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


పాపయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తికి వైద్యం అందించడానికి ఆ నిరుపేద కుటుంబం లక్షలు ఖర్చుచేసినా చివరికి ప్రాణం దక్కలేదు. అప్పులు చేసి ఇంటి పెద్ద దిక్కును కాపాడుకోవాలనే ఆశలు ఆవిరయ్యాయి. ఐదు నెలలుగా వైద్యం అందించడానికి ఆ కుటుంబం రూ.8లక్షలు ఖర్చు చేసింది. పాములు పడుతూ.. కుటుంబాన్ని పోషించుకుంటున్న పెద్ద దిక్కు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఎల్లారెడ్డిపేటలోని కేసీఆర్ డబుల్‌బెడ్ కాలనీలో నివసిస్తున్న కడమంచి పాపయ్య ఉరఫ్ పాములుపట్టె పాపయ్య(65) సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా.. కామారెడ్డి వైపు నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో దూరంగా ఎగిరిపడ్డ పాపయ్య తలకు బలమైన గాయాలు కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి రూ.8లక్షలు వెచ్చించి వైద్యం అందించారు. కొంతవరకు ఆరోగ్యం నయంకావడంతో ఇంటికి తీసుకొచ్చారు. పాపయ్యకు ఖరీదైన వైద్యం అందించడానికి మరో శస్త్రచికిత్స కోసం రూ.15లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంచారు. గత ఐదు నెలలుగా మంచానికే పరిమితమైన పాపయ్య గురువారం మరణించారు. మృతునికి భార్య సాయవ్వ, కుమారుడు కృష్ణ ఉన్నారు. నిరుపేద పాపయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దీపావళి బోనస్ చర్చలు సఫలమయ్యేనా?

- నేడు యాజమాన్యంతో కార్మికసంఘం నాయకుల భేటీ

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కార్మికులకు దీపావళి పండుగ సందర్భంగా చెల్లించాల్సిన బోనస్‌పై శుక్రవారం కార్మిక సంఘం నాయకులు, యాజమాన్యం మధ్య చర్చలు జరుగనున్నాయి. ఏటా కార్మికులకు దీపావళి పండుగకు ముందే చెల్లించాల్సిన బోనస్ విషయంలో ఈయేడాది తీవ్ర జాప్యమైంది. కార్మికులు గతేడాది కంటే 20-30శాతం అదనంగా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేయగా యాజమాన్యం మాత్రం గతం కంటే తక్కువ బోనస్‌ను కార్మికుల అకౌంట్లలో జమ చేసింది. ఈనేపథ్యంలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికసంఘాల ఆధ్వర్యంలో కార్మికులు గతనెలలో వివిధ రకాల నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు చివరకు విధులు బహిష్కరించి గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో కంపెనీ అధికారులు ఎన్టీపీసీలోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను ఆశ్రయించడంతో స్పందించిన ఏఎల్‌సీ కార్మికసంఘం నాయకులతో మాట్లాడి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచిస్తూ గతనెల 27న ఇరువర్గాలతో చర్చలు జరిపారు. చర్చల్లో పాల్గొన్న కంపెనీ అధికారులలో ఎవరికీ సొంత నిర్ణయం తీసుకునే అధికారం లేని కారణంగా చర్చలను డిశంబర్ 13వ తేదీకి వాయిదా వేశారు. స్థానికంగా పూర్తిస్థాయి నిర్ణయాధికారం తీసుకునే అధికారులు ఎవరూ లేకపోవడంతో హైదరాబాద్‌లో కంపెనీ ఉన్నతాధికారుల సమక్షంలో చర్చలు నిర్వహించి వివాదం పరిష్కరించుకోవాలని సూచించారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లో కేశోరాం ఉన్నతాధికారులతో పర్మినెంట్ కార్మికసంఘం నాయకులు చర్చలు జరుపనున్నారు. ఇందుకుగాను కార్మికసంఘం నాయకులు రెండురోజుల క్రితమే హైదరాబాద్‌కు వెళ్లినట్లు సమాచారం. దాదాపు రెండునెలలుగా కంపెనీలో వివాదాస్పదంగా మారిన దీపావళి బోనస్ సమస్య ఈసారైనా పరిష్కారమవుతుందా? అని కార్మికులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.


విద్యార్థుల ప్రదర్శనలు


తిలకిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

భళా.. బాల శాస్త్రవేత్తలు

- ఆకట్టుకున్న విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ఆవరణలో బుధవారం నుంచి జరుగుతున్న జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. జిల్లావ్యాప్తంగా వివిద ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు నూతన సాంకేతికత తదితర పరిజ్ఞానంతో నూతన శకానికి నాంది పలికేలా వారి మదిలో మెదిలిన ఆలోచనలు, ఉపాధ్యాయుల సూచనలతో తయారు చేసిన ప్రదర్శనలను చూసేందుకు గురువారం విద్యార్థులు క్యూ కట్టారు.

రాజన్న సేవలో పుష్ప-2 సినీనటి


రాజన్నను దర్శించుకున్న సినీనటి గార్లపాటి కల్పలతకు స్వామి వారి ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు


కొండగట్టులో సినీనటి గార్లపాటి కల్పలత

వేములవాడ: రాజన్నను తెలుగు సినీనటి గార్లపాటి కల్పలత(పుష్ప-2 మూవీలో పుష్ప తల్లిగా నటించారు) గురువారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు వేదోక్త ఆశీర్వచనం గావించారు. పలువురు భక్తులు, స్థానికులు ఆమెతో ఫొటోలు దిగారు.

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్నను తెలుగు సినీనటి గార్లపాటి కల్పలత దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు గుండి హరిహర్నాథ్, ఉపాధ్యాయుల చంద్రశేఖర్ ఉన్నారు.

సోమాజిగూడ యశోదలో అరుదైన వాస్క్యులర్ చికిత్స


మాట్లాడుతున్న డాక్టర్ దేవేందర్‌సింగ్

కరీంనగర్‌టౌన్: సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో తల, మెడకు సంబంధించిన అరుదైన ఆర్టిరియోవెనస్ మాల్ఫార్మేషన్ (ఏవీఎం) వ్యాస్క్యులర్ ట్యూమర్‌ను విజయవంతంగా తొలగించినట్లు యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ వాస్కులర్, ఎండోవాస్కులర్ సర్జన్ డాక్టర్ దేవేందర్ సింగ్ తెలిపారు. గురువారం కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్‌లో చికిత్సకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన జస్బీర్‌సింగ్ అనే వ్యక్తి ఈత కొట్టేటప్పుడు గాయపడి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. తల, మెడ నుంచి అనియంత్రిత రక్తస్రావంతో అతని పరిస్థితి తీవ్రమైందని, హైపోటెన్షన్, షాక్‌తో ఆయనను అత్యవసరంగా యశోద హాస్పిటల్స్‌కు తీసుకొచ్చారని తెలిపారు. అతనికి రక్తమార్పిడి చేసి, వెంటనే కాథ్ ల్యాబ్‌లో పరీక్షల అనంతరం పుట్టుకతోనే ఉన్న అరుదైన వ్యాధి ఆర్టిరియోవెనస్ మాల్ఫార్మేషన్ ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ క్లిష్టమైన పరిస్థితిని అధిగమించడానికి, రక్తస్రావాన్ని నియంత్రించడానికి ఎండోవాస్క్యులర్ పద్ధతులను వినియోగించినట్లు గాయపడిన కణజాలాలను, ట్యూమర్‌ను పూర్తిగా తొలగించాలన్నారు. జస్బీర్‌సింగ్ మాట్లాడుతూ... యశోద హాస్పిటల్ అందించిన వైద్య సేవలతో నేడు సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తున్నట్లు తెలిపారు.



వైభవంగా గీతా జయంతి

వేములవాడ: రాజన్న సన్నిధిలో గురువారం పూర్ణాహుతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి నాగిరెడ్డి మంటపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండాల్లో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మూడు రోజుల నుంచి జరుగుతున్న గీతా జయంతి ఉత్సవాలు గురువారంతో ముగిసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాజన్నను గురువారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రాజన్నకు అభిషేకాలు, అర్చనలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణవ్రతాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.



